# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 273 | బుధవారం, 09 సెప్టెంబర్ 2026






# మట్టి గణపతులను పూజిద్దాం..

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

- శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి
- పీస్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2 లో



4 లో

## ఘనంగా చండీ హోమం


wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# మట్టి గణపతులను పూజిద్దాం..
# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** రాబోయే వినాయక చవితి పండుగ, గణేష్ నవరాత్రి ఉత్సవాలతో పాటు నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికలతో పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం శాంతి కమిటీ ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు మరియు జిల్లా అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 770 చెరువుల్లో సుమారు 2,000 గణేష్ విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్నారు. ఉత్సవాల నిర్వహణ మరియు భద్రతపై అధికారులకు ఆయన పలు కీలక సూచనలు చేశారు:

- **మండపాలు, పారిశుద్ధ్యం :** గణేష్ మండపాల వద్ద ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా ఏర్పాటు చేయాలి. భక్తుల రద్దీని బట్టి క్యూ లైన్లు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. మండపాల వద్ద నిరంతరం పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలి.
- **నిమజ్జనం, రక్షణ ఏర్పాట్లు :** నిమజ్జన ఘాట్ల వద్ద 12 అడుగుల లోతు వరకు బలమైన బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రతీ ఘాట్ వద్ద నిరంతరం గజ ఈతగాళ్లను (స్విమ్మర్లు), రెస్క్యూ బోట్లను, భారీ క్రేన్లను అందుబాటులో ఉంచాలి. ప్రధాన మార్గాల్లో రోడ్ల గుంతలను వెంటనే పూడ్చాలని ఆర్ & బీ అధికారులను ఆదేశించారు.
- **ట్రాఫిక్, భద్రత :** కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాలతో 24 గంటలు పర్యవేక్షించాలి. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయాలి. నిమజ్జనం జరిగే రెండు రోజుల పాటు మద్యం విక్రయాలపై పూర్తిగా నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు.
- **వైద్యం.. విద్యుత్ :** నిమజ్జన ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ టీమ్‌లను, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలి. విద్యుత్ అంతరాయం కలగకుండా అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను అందుబాటులో ఉంచాలి. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (POP) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులనే ప్రతిష్ఠించి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ వెంకట్ రెడ్డి, డీఎంహెచ్ఓ వాణి శ్రీ, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ సంపత్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్ మెంట్స్ విడుదల చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో నిలిచి పోయిన రూ. 14 వేల కోట్ల విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దోజు జగదీష్ ఆధ్వర్యంలో గురువారం జనగామ తహసీల్దార్ (ఎమ్మార్వో)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులు, ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. బకాయిలు విడుదల చేయకపోతే దశలవారీగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని, ప్రజాప్రతినిధులు, మంత్రులను తిరగకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ పిట్టల సత్యం, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జీవనజ్యోతి, నాయకులు ఎనగందుల కళ్యాణి, గంధం రాములు, దూసరి శివకృష్ణ, సీనియర్ నాయకులు కీర్తి నర్సయ్య, సాంబ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా సస్పెన్షన్‌పై ప్రభుత్వం సమాధానం చెప్పాలి : ధర్మపురి శ్రీనివాస్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని శాసనసభ నుంచి ఎందుకు సస్పెండ్ చేశారో ప్రభుత్వం, స్పీకర్ స్పష్టం చేయాలని బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సభలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందన్న ఆయన, ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కేలా సస్పెన్షన్లు విధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవిస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.



## కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలను, మానవతా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజీ తెలంగాణ ఆత్మను, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన బహుభాషా కోవిదుడని కొనియాడారు. పద్మవిభూషణ్ గ్రహీత అయిన కాళోజీ, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి సమాజానికి మార్గదర్శకంగా నిలిచారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్షాలోం, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





## విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

**కోలుకొండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు**

దేవరుప్పుల, మన చౌరాస్తా : పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం దేవరుప్పుల మండలంలోని కోలుకొండ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వంటశాల, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. లైబ్రరీలో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, ఎంపీడీఓ పి. మేనక, హెడ్‌మాస్టర్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



## 3వ వార్డులో రోడ్లు, డ్రెయిన్ల పనులు ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి శ్రీనివాస్**

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని 3వ వార్డులో అర్బన్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (UDIF) నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్ బూడిది జ్యోతి అధ్యక్షతన ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జనగామ పట్టణంలో ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణంలోని అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు దోర్నాల అనిత, వంగ ఉమా, ఏఈ సత్యమూర్తి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు బూడిది గోపి, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రసాయనాల వాడకం తగ్గించాలి

## మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** రైతులు అధిక రసాయనాల వినియోగాన్ని తగ్గించి, భూసారాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం దేవరుప్పుల మండలంలోని కోల్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్'లో భాగంగా నిర్వహించిన మృత్తికా విశ్లేషణ, అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధిక రసాయనాల వల్ల మట్టి విషతుల్యమై పంటల దిగుబడి తగ్గుతోందని, మట్టి పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని తెలిపారు. విద్యార్థులు సాయిల్ హెల్త్ కిట్ల ద్వారా తమ పొలాల మట్టి నమూనాలను పరీక్షించి, రసాయనాల నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు RSTL శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధ, డాక్టర్ వికాస్ మట్టి నమూనాల సేకరణ, పరీక్షించే విధానాన్ని విద్యార్థులకు ప్రదర్శించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, ఎంఏఓ మనోహిత్ విక్రమ్ రావు, హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# సర్పంచుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలోని గ్రామాల అభివృద్ధి, సర్పంచుల హక్కులు, గ్రామ పంచాయతీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్మెట్ట సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అత్యంత అందుబాటులో ఉండే సర్పంచులకు సరైన అధికారాలు, నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి, సర్పంచుల హక్కులను పరిరక్షించాలని కోరారు. సర్పంచులందరూ ఐక్యంగా ఉంటూ తమ హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాస్వామ్యయుతంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



# సోషల్ మీడియా మెసేజ్‌లతో సస్పెన్షన్ అప్రజాస్వామికం

## జనగామ బీఆర్ఎస్ కౌన్సిలర్లు

**జనగామ, మన చౌరాస్తా :** సోషల్ మీడియా మెసేజ్‌ల ఆధారంగా బీఆర్ఎస్ 18వ వార్డు కౌన్సిలర్ సుగుణాకర్ గౌడ్‌ను సస్పెండ్ చేయడాన్ని జనగామ బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రేమలత రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఎలాంటి ముందస్తు నోటీసులు, విచారణ లేకుండా ఏకపక్షంగా సస్పెన్షన్ విధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిపై కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. వెంటనే సుగుణాకర్ గౌడ్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో కౌన్సిలర్లందరితో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జమున, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, కౌన్సిలర్లు సుగుణాకర్, పానుగంటి సువార్త, నాయకులు మామిడాల రాజు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను

# జయప్రదం చేయాలి

## సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్

**జనగామ, మన చౌరాస్తా :** సెప్టెంబర్ 10 నుండి 17 వరకు నిర్వహించనున్న వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితంగానే హక్కుల పోరాట స్ఫూర్తి బలపడిందని తెలిపారు. ఈ వారోత్సవాల సందర్భంగా పట్టణంలో సభలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, వీధి దీపాల వంటి మౌలిక వసతుల సమస్యలపై కాంగ్రెస్ పాలకవర్గం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పట్టించుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బూడిది గోపి, బాల్నే వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, దామెర అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.






## జనగామ పట్టణ రేషన్ డీలర్ల

# అధ్యక్షుడిగా ధర్మపురి రామాచారి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ రేషన్ డీలర్ల నూతన కమిటీ ఎన్నికైంది. నాయకుడు ఊటుకూరు మురళీధర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డీలర్లందరూ ఏకగ్రీవంగా పట్టణ అధ్యక్షుడిగా ధర్మపురి రామాచారిని ఎన్నుకున్నారు. అలాగే పట్టణ గౌరవ అధ్యక్షుడిగా చెంచారపు బుచ్చిరెడ్డి, కార్యదర్శిగా ఎమ్. ప్రవీణ్, ఉపాధ్యక్షురాలిగా బోట్ల సుమతి, కోశాధికారిగా జి. శ్రీలత, సహాయ కార్యదర్శిగా దాసి స్వరూప వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారుగా ఆకుల బాలనిలా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పట్టణ రేషన్ డీలర్లు ఈ సందర్భంగా అభినందించారు.

# కాళోజీ కవిత్వంపై అవగాహన సదస్సు



**నల్లగొండ, మన చౌరాస్తా :** తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'కాళోజీ కవిత్వం సామాజిక చైతన్యం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన డాక్టర్ ముదుంబై పురుషోత్తమాచార్యులు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో కాళోజీ అత్యంత సాహసోపేతమైన కవి అని, ప్రజా భాషకు తన కవిత్వంతో ఉన్నత గౌరవాన్ని తెచ్చారని కొనియాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ కాళోజీ పోరాట స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ భూక్య వీరన్న మాట్లాడుతూ పాఠ్యాంశాల భాషతో పాటు గ్రామీణ ప్రజల సహజ భాషను విద్యార్థులు అర్థం చేసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో తెలుగు అధ్యాపకులు వై. విజయ, చల్లా నరేందర్, సాగర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**జనగామ, మన చౌరాస్తా :** మండలంలోని చీటకోడూరు గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని వీరభద్ర రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం నాయకులు మాట్లాడుతూ, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక న్యాయం, పేదల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కూకట్ల యాదగిరి, రజక సంఘం నాయకులు ఓరుగంటి సోమయ్య, అబ్బసాయిలు, లక్ష్మయ్య, నర్సింహులు, బిక్షపతి, ఐలయ్య, మహేందర్, శేఖర్, గ్రామస్తులు గంధమల్ల ఎల్లేష్, గడ్డం కిష్టయ్య, గాదరి చిలకయ్య, తదితరులు పాల్గొన్నారు.



## హమారా ప్రసాద్‌పై రాజ్యద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పిత నాయకుడంటూ సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్‌పై రాజ్యద్రోహం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని 'కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరుశురామ్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరుశురామ్ మాట్లాడుతూ.. గతంలో కూడా అంబేద్కర్ బ్రతికి ఉంటే ఎన్‌కౌంటర్ చేసేవాడినంటూ హమారా ప్రసాద్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగ నిర్మాతపై అబద్ధాలు ప్రచారం చేస్తూ పుస్తకం విడుదల చేయాలని చూస్తే పౌర సమాజం ఊరుకోదని, దేహశుద్ధి చేసి అడ్డుకుంటామని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి జాతీయ సలహాదారులు మల్లిగారి రాజు, మచ్చ కుమార్, చింతల కనుకరాజు, మౌనిక, పి. రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని జనగామ జిల్లా బీజేపీ స్టేషన్ ఘనాపూర్ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎలక్షన్ డీటీ సదానందంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం ఆలస్యం కావడంతో ఉన్నత విద్య కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రడపాక ప్రదీప్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కందిమల్ల కృష్ణమూర్తి, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ తౌటి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మండల ఎస్ఐఆర్ కన్వీనర్ సట్ల రాజకుమార్, మండల ఉపాధ్యక్షుడు బుర్ల అనిల్, సీనియర్ నాయకుడు మహేశ్వరం రమేష్‌చారి, జిల్లా నాయకులు భాస్కుల నరసయ్య, వైట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సోమన్నకు వెండి పడిగే సమర్పణం



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి వారికి బుధవారం భక్తుడు మిశ్రమ వెండి నాగ పడిగేను సమర్పించినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రానికి చెందిన భక్తుడు అరూరి. రవి భార్గవి దంపతులు స్వామివారికి రూ. 38 వేల విలువైన 14 తులాల మిశ్రమ వెండి నాగ పడిగేను సమర్పించినట్లు తెలిపారు, అర్చకులు డివిఆర్ శర్మ, దేవగిరి. అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**సోమేశ్వర ఆలయంలో ఘనంగా చండి యాగం**

పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవంలో భాగంగా బుధవారం స్వామివారికి లక్ష బిల్వర్చన, కుంకుమార్చన, తులసి అర్చన, చండీయాగం కార్యక్రమలు అత్యంత వైభోవో పేతంగా నిర్వహించారు. చండిక అమ్మవారి ఆలయంలో స్వామి వారి మాస కళ్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, అర్చకులు డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, దేవగిరి సంతోష్, శ్యామ్, భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మండపాల వద్ద విద్యుత్ భద్రతా నియమాలు తప్పక పాటించాలి : డీఈ

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ బుధవారం మునిసిపల్ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఏడిఈ పాల్వాయి,రణధీర్ రెడ్డితో కలిసి పర్యవేక్షించిన ఎన్పిడిసీఎల్ డిఈ ఆపరేషన్ ఘనపూర్ బి.సారయ్య. ఈసందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులతో విద్యుత్ భద్రతా చర్యలు,విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు,వైరింగ్ ఇతర భద్రతా జాగ్రత్తలు గురించి చర్చించారు.మండపాల వద్ద ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు,షార్ట్ సర్క్యూట్‌లు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను నిర్వాహకులకు వివరించారు.ఈకార్యక్రమంలో ఏఈలు శ్వేత,పి.శంకర్,శివ కుమార్, విద్యుత్ గుత్తేదార్ చల్లా రఘురెడ్డి,లైన్ ఇన్స్పెక్టర్ పెద్దిరెడ్డి,యాదగిరి,లైన్మెన్ సుధాకర్,శ్రీధర్,ఏఎల్ఎం వెంకటేష్, నాగరాజు,సురేష్,అశోక్,మండపాల నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**